శనివారం 23 నవంబర్ 2024

ఈ-పేపర్ తెలుగు డైలీ

# ఇయ్యాల్టి NEWS

Local 2 GlobaL

https://epaper.eyyaltynews.com/

## ముగిసిన రాష్ట్రపతి రెండు రోజుల పర్యటన..ఢిల్లీకి ద్రౌపతిముర్ము

ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, నవంబర్ 22: దేశ సంస్కృతి, సంప్రదాయాలను బలోపేతం చేసే గొప్ప కార్యక్రమం అని లోక్ మంథన్ అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. లోక్‌మంథన్ కార్యక్రమాన్ని ద్రౌపది ముర్ము ప్రారంభించారు. అనంతరం రాష్ట్రపతి మాట్లాడుతూ.. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం గర్వంగా భావిస్తున్నానని తెలిపారు. 2018 రాంచీలో జరిగిన లోకమంథన్ లో ప్రత్యక్షంగా పాల్గొన్నానని తెలిపారు. ఆ తర్వాత ఇవాళ మరోసారి లోకమంథన్ లో పాల్గొనే అవకాశం కలిగిందన్నారు.లోక్ మంథన్ కార్యక్రమం అనంతరం బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఢిల్లీ వెళ్లారు. శుక్రవారంతో రాష్ట్రపతి రెండు రోజుల పర్యటన ముగింది.







ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు....

2లో



చితిపై తగలబడుతుండగా ఒక్కసారిగా లేచిన యువకుడు.. ఆ తర్వాత ఏం జరిగిందంటే..!..

3లో



కింగ్ చార్లెస్ పట్టాభిషేకం.. ఎన్ని కోట్లు ఖర్చు చేశారో వింటే షాకే... .!..

3లో



ముగిసిన మోదీ విదేశీ పర్యటన..

3లో

# రాష్ట్ర కేబినెట్ విస్తరణకు కౌంట్ డౌన్



## పరిశీలనలో ఉన్నవారెవరంటే...?

ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, నవంబర్ 22: ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న రాష్ట్ర కేబినెట్ విస్తరణకు కౌంట్ డౌన్ స్టార్ట్ అయింది. ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తుండటంతో దానికంటే ముందే ముహూర్తం ఫిక్స్ కానుంది. ఆ తర్వతా అసెంబ్లీ సమావేశాలు డిసెంబర్ 9 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లో రైతు, కుల గణన సర్వే, మరియు ఆర్ ఓ ఆర్ చట్టంపై చర్చ జరగనుంది. ప్రభుత్వం ఇప్పటికే అనేక కీలక అంశాలను ఈ సమావేశాల్లో ముందుకు తీసుకురావడానికి సిద్ధమవుతోంది. డిసెంబర్ 7తో రేవంత్ రెడ్డి ప్రభుత్వం తన పదవీకాలంలో ఏడాది పూర్తి చేయనుంది. ఈ సందర్భంగా మంత్రివర్గ విస్తరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. మహారాష్ట్ర ఎన్నికల ఫలితాల అనంతరం ఈ ప్రక్రియ వేగం పుంజుకోనుందని తెలుస్తోంది. నిజామాబాద్, ఆదిలాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి వంటి జిల్లాలకు ప్రస్తుతం కేబినెట్‌లో ప్రాతినిధ్యం లేకపోవడం, విస్తరణను మరింత కీలకంగా మారుస్తోంది.ఈ మంత్రివర్గ విస్తరణలో మైనారిటీలకు ప్రాధాన్యత ఇవ్వాలని, యువతకు అధిక అవకాశాలు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యంగా ముదిరాజ్ సామాజిక వర్గానికి ఒక బెర్త్ కచ్చితంగా ఇస్తామని సీఎం హామీ ఇచ్చారు. విస్తరణలో తోడుగా కొన్ని శాఖల మార్పు కూడా ఉండే అవకాశం ఉంది. మొత్తం 6 మంత్రివర్గ స్థానాల కోసం 10 మంది ఎమ్మెల్యేలు పోటీ పడుతున్నారు. అదిలాబాద్ నుంచి ప్రేమ్ సాగర్ రావు, గడ్డం వివేక్, గడ్డం వినోద్‌బీ నిజామాబాద్ నుంచి సుదర్శన్ రెడ్డి, మదన్ మోహన్ రావుబీ మహబూబ్ నగర్ మక్తల్ నుండి వాకిటి శ్రీహరి పేర్లు పరిశీలనలో ఉన్నాయి. ఎస్టీ కోటాలో బాలునాయక్, నల్గొండ జిల్లాలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి బలమైన ఆశావహులుగా ఉన్నారు.ఇదిలా ఉంటే రాష్ట్రంలో త్వరలోనే పంచాయతీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో.. ఆసరా పెన్షన్, రైతు భరోసా వంటి పథకాల అమలుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ పథకాలు ప్రజల్లో ప్రభుత్వం పై నమ్మకాన్ని పెంచేందుకు దోహదపడతాయని భావిస్తోంది. ఇదిలా ఉంటే కొండపోచమ్మ సాగర్ సమీపంలోని హరీష్ రావు ఫాం హౌస్ పై విచారణను ప్రభుత్వం ప్రారంభించింది. ఈ చర్యతో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కనుంది. ఇవన్ని రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికరంగా మారాయి . డిసెంబర్ సమావేశాలు, మంత్రివర్గ విస్తరణపై అందరి ోకస్ ఉంది.

## రాష్ట్రంలో రూ.5,260 కోట్ల పెట్టుబడులు


### సీఎంతో ఆరు ఫార్మా కంపెనీల ప్రతినిధుల భేటీ



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, నవంబర్ 22: రాష్ట్రంలో పరిశ్రమలను నెలకొల్పి తద్వారా యువతకు ఉపాధి అవకాశాలను పెంచాలని చూస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా మరో కీలక ముందడుగు వేసింది. తాజాగా దేశంలో పేరొందిన పలు ఫార్మా కంపెనీల తో ఎంవోయూలు కుదుర్చుకుంది. దీంతో రాష్ట్రానికి దాదాపు రూ.5,260 కోట్లు పెట్టుబడులు వచ్చాయి. వీటి ద్వారా ఫార్మా రంగంలో 12,490 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. ఎంఎస్ఎన్ గ్రూప్, లారస్ ల్యాబ్స్, గ్లాండ్ ఫార్మా, డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్, అరబిందో ఫార్మా, హెటిరో ల్యాబ్స్ కంపెనీల ప్రతినిధులు శుక్రవారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో సంప్రదింపులు జరిపారు.

## రేవంత్ సర్కార్ అరుదైన ఘనత!

### తొలి ఏడాదిలోనే అర లక్ష ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ





ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, నవంబర్ 22: ప్రజా పాలనలో తెలంగాణ యువత భవిత మలుపు తిరిగిందా అంటే అవుననే అంటుంది తెలంగాణ ప్రభుత్వం. తొలి ఏడాదిలోనే ప్రజా ప్రభుత్వం యువతకు ఇచ్చిన మాట ప్రకారం ఉద్యోగ నియామకాల మేళా నిర్వహించామంటుంది. ఉద్యోగాల భర్తీలో కొత్త రికార్డు నమోదు చేసింది తెలంగాణ సర్కార్. దేశంలో ఏ రాష్ట్రంలోలేని విధంగా మొదటి ఏడాదిలోనే 53 వేలకుపైగా ఉద్యోగ నియామకాలు చేపట్టింది. గడిచిన పదేండ్లలో ఉద్యోగాల భర్తీలేక విసిగివేసారిన నిరుద్యోగుల జీవితాల్లో సరికొత్త మార్పు తెచ్చింది. అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యూపీఎస్సీ తరహాలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రక్షాళన చేపట్టారు. అప్పటివరకు పెండింగ్‌లో ఉన్న పరీక్షలు, ఫలితాలకు ఉన్న అడ్డంకులన్నింటినీ ప్రభుత్వం తొలిగించింది. పదేండ్లుగా ఉద్యోగాల భర్తీ లేనందున యువత నష్టపోకుండా టీజీపీఎస్సీ నియామకాలకు వయో పరిమితిని సడలించింది. గత ప్రభుత్వలో రద్దయినవి.. వాయిదా పడ్డవి.. పెండింగ్‌లో పెట్టిన ఫలితాలన్నింటినీ విడుదల చేసింది. ఎంపికైన అభ్యర్థులందరికీ నియామక పత్రాలను అందించింది.దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో వార్షిక జాబ్ క్యాలెండర్‌ను సైతం ప్రకటించింది. క్యాలెండర్ ప్రకారం ప్రభుత్వ ఉద్యోగ నియామకాలను నిరంతర ప్రక్రియగా నిర్వహించే వినూత్న విధానాన్ని అమల్లోకి తెచ్చింది. బీఆర్ఎస్ హయాంలో పదేండ్లలో ఒకేసారి డీఎస్సీ వేసి 7,857 టీచర్ పోస్టులు భర్తీ చేస్తే%ూ% కొత్త ప్రభుత్వం కేవలం పది నెలల వ్యవధిలోనే 11,062 పోస్టులతో మెగా డీఎస్సీ 2024 నిర్వహించింది. జులైలో పరీక్షలు నిర్వహించి, రికార్డు వేగంతో సెప్టెంబర్ 30వ తేదీన ఫలితాలను వెల్లడించింది. ఎంపికైన అభ్యర్థులకు దసరా పండుగ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియామక పత్రాలు అందించారు. వీరిలో 10,006 మంది ఉద్యోగాల్లో చేరారు. రెసిడెన్షియల్ సొసైటీల పరిధిలో టీజీటీ, పీజీటీ, జూనియర్ లెక్చరర్లు, డిగ్రీ కాలేజీ లెక్చరర్ పోస్టులన్నీ కలిపి కొత్త ప్రభుత్వం 8,304 మందికి నియామక పత్రాలను అందించింది.పేపర్ లీకేజీతో గందరగోళంగా మారిన గ్రూప్ 1 పరీక్షను కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేసింది. 563 పోస్టులతో కొత్త నోటిఫికేషన్ ఇచ్చింది. గ్రూప్ 1 ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలను విజయవంతంగా నిర్వహించింది. షెడ్యూలు ప్రకారమే నవంబర్లో గ్రూప్ 3 పరీక్షలు నిర్వహించింది. డిసెంబర్ 15, 16 తేదీల్లో గ్రూప్ 2 పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేసింది. టీజీపీఎస్సీ వివిధ నోటిఫికేషన్‌ల ద్వారా ఈ ఏడాదిలో 3,393 ఉద్యోగ నియామకాలు చేపట్టింది. ఇరిగేషన్ విభాగంలో 687 మంది ఏఈఈలకు, రవాణా శాఖ పరిధిలో 96 మంది ఏఎంవీఐలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా నియామక పత్రాలు అందించారు.





## అదానీతో చేసుకున్న ఒప్పందాలు రద్దు చేయాలి.. రేవంత్ సర్కార్‌కు కేటీఆర్ డిమాండ్

ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, నవంబర్ 22: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అదానీతో చేసుకున్న ఒప్పందాలన్నింటినీ రద్దు చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. అదానీ వ్యవహారంపై తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. అదానీ బండారం మళ్లీ అంతర్జాతీయంగా బయటపడింది. అమెరికా నుంచి ఆఫ్రికా సహా దేశంలో ఆయన వ్యవహారంపై ప్రకంపనలు మొదలయ్యాయి. అదానీపై కేసు పెట్టాలని, జేపీసీ వేయాలని ఎన్నిసార్లు కోరినప్పటికీ ప్రధాని మోడీ పట్టించుకోలేదు. అదానీ కంపెనీలకు సంబంధించి అవకతవకలు జరిగినట్లు రెండుసార్లు బయటపడింది. అమెరికాలో ఓ కోర్టు అదానీ సంస్థ లంచాలు ఇచ్చినట్లు తీర్పు చెప్పింది. గతంలో హిండెన్ బర్గ్ అనే సంస్థ కూడా అవకతవకలు జరిగినట్లు చెప్పింది. అదానీ అంశం కారణంగా భారతదేశ ప్రతిష్ట అంతర్జాతీయంగా మసకబారింది. అదానీ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టి చాలా మంది మధ్యతరగతి మదుపర్లు నష్టపోయారని కేటీఆర్ తెలిపారు.

## ఆ పరిధిలోని ఇళ్లను కూల్చబోం.

### హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంచలన కామెంట్స్



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, నవంబర్ 22: చెరువుల పరిధిలోని ఇళ్లను కూల్చబోమని, నిర్మాణాలను కూల్చి చెరువులను కాపాడటం తమ ఉద్దేశం కాదని 'హైడ్రా' కమిషనర్ రంగనాథ్ అన్నారు. శుక్రవారం 'హైడ్రా' బ్రెయిన్ స్టోర్మ్ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. చెరువులను పునరుద్ధరించాలంటే ఇళ్లను కూల్చివేయాల్సిన అవసరం లేదన్నారు. ఇక నుంచి ఎఫ్టీఎల్ పరిధిలో నూతన నిర్మాణాలను అడ్డుకోవడమే లక్ష్యంగా పెట్టుకుంటామని అన్నారు. ముందుగా చెరువులో నీటి విస్తీర్ణం, శాటిలైట్ మ్యాప్ లు, పంచాయతీల్లో మ్యాప్‌లు, సర్వే ఆఫ్ ఇండియా మ్యాప్‌లను ప్రామాణికంగా తీసుకుంటామని అన్నారు. అనుమతులు లేకుండా ఎఫ్టీఎల్ పరిధిలో ఇళ్లను నిర్మిస్తే.. వాళ్లు ఎంత పెద్దవాళ్లైనా సరే కూల్చేస్తామని స్పష్టం చేశారు. ఆక్రమణల నియంత్రణకు ఆధునిక సాంకేతికతను వాడుతున్నామని, నిబంధనలకు విరుద్ధంగా ఎఫ్టీఎల్ పరిధిలో ఎవరైనా నిర్మాణాలు చేపడితే తమకు అలర్ట్ వస్తుందని పేర్కొన్నారు. అమీన్‌పూర్ తూములు మూయడంతో లేఅవుట్లు మునిగాయని.. తప్పుడు అనుమతులు ఇచ్చిన ఇళ్లను మాత్రమే కూల్చివేశామని క్లారిటీ ఇచ్చారు. కొంతమందిపై చర్యలతో 'హైడ్రా' పని అందరికీ తెలిసిందని, ప్రజల్లో ఎఫ్‌టీఎల్ , బఫర్ జోన్ల పై అవగాహన వస్తుందని కమిషనర్ రంగనాథ్ అన్నారు.

## మహారాష్ట్ర, జారండ్ అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్‌కు కౌంట్ డౌన్ షురూ





కాసేపట్లో అభ్యర్థు టెన్షన్ కు చెక్

ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, నవంబర్ 22: మహారాష్ట్ర, జార?ండ్ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపుకు సర్వం సిద్ధమైంది. ఈ రోజు శనివానం ఉదయం కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు జరగనుండగా.. ఉదయం 8.30 నుంచి ఈవీఎంల ఓట్లను అధికారులు లెక్కించనున్నారు. ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా కౌంటింగ్ కేంద్రాల వద్ద భారీ భద్రత ఏర్పాటు చేశారు. మహారాష్ట్రలోని 288 అసెంబ్లీ స్థానాలు, జార?ండ్?లోని 81 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జరగగా..ఈ రెండు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలతో పాటు 15 రాష్ట్రాల్లోని 48 అసెంబ్లీ, రెండు పార్లమెంట్ స్థానాలకు ఉపఎన్నికలు నిర్వహించింది ఈసీ.

**మహారాష్ట్ర ఎన్నికల వివరాలు:**

మహారాష్ట్ర??లో గెలుపుపై ఎన్డీఏ, ఇండియా కూటములు ధీమాతో ఉన్నాయి. మహారాష్ట్ర ఎన్నికల్లో ప్రధాన అంశాలుగా కుల గణన, రిజర్వేషన్లు, రైతుల పంటలకు మద్దతు ధర, ఉద్యోగాలు, సంక్షేమ పథకాలు నిలువగా.. జార?ండ్ ఎన్నికల్లో అక్రమ చొరబాట్లు, రిజర్వేషన్లు, జేఎంఎం అవినీతి, రైతుల పంటలకు మద్దతు ధరలు, ఉద్యోగాలు, సంక్షేమ పథకాల వంటివి ప్రధాన అంశాలుగా నిలిచాయి. మహారాష్ట్రలో మొత్తం 288 అసెంబ్లీ స్థానాలు ఉండగా.. ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన మేజిక్ ఫిగర్ 145 సీట్లు.

**జార?ండ్ వివరాలు:**

జారండ్‌లోని మొత్తం 81 అసెంబ్లీ స్థానాలకు రెండు దశల్లో పోలింగ్ జరిగింది. ఇండియా కూటమిలో భాగంగా జేఎంఎం (43), కాంగ్రెస్ (30), ఆర్జేడీ (6), సీపీఐఎంఎల్(2) స్థానాల్లో పోటీ చేశాయి. ఎన్డీఏ కూటమిలో భాగంగా బీజేపీ (68), ఏజేఎస్యూ ఆల్ ఝూర?ండ్ స్టూడెంట్ యూనియన్ (10), జేడీయూ (2), లోక్ జన శక్తి (1) స్థానంలో బరిలో నిలిచాయి. జార?ండ్?లో ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన మేజిక్ ఫిగర్ 42 స్థానాలు. జార?ండ్?లో గెలుపుపై ఎన్డీఏ, ఇండియా కూటములు ధీమాగా ఉన్నాయి. ఎన్నికల తర్వాత వెలువడిన ఎగ్జాట్ పోల్స్ మాత్రం జార?ండ్?లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమికి పట్టాం కట్టాయి.

## తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు పనులను పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, నవంబర్ 22: రాష్ట్ర సచివాలయ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు పనులను సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు. విగ్రహ ఏర్పాటు పనులు చేస్తున్న కూలీలను పలకరించిన రేవంత్ రెడ్డి.. పనులు జరుగుతున్న తీరు, ఇతర వివరాలు అడిగి తెలుసుకున్నారు. డిసెంబర్ 9న సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించనున్నారు. తెలంగాణ తల్లి విగ్రహ పనుల పరిశీలనను రేవంత్ రెడ్డి ఎక్స్ లో పోస్టు చేశారు. రాష్ట్ర సచివాలయ ప్రాంగణంలో నాలుగు కోట్ల ప్రజల ప్రేమమూర్తి తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనకు శరవేగంగా జరుగుతోన్న పనులను ఈ రోజు పరిశీలించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ పవిత్ర కార్యంలో పాలుపంచుకుంటున్న శ్రమ జీవులతో పనులు జరుగుతున్న తీరు ఇతర అంశాలపై కాసేపు ముచ్చటించడం జరిగిందని ట్వీట్ చేశారు. రాష్ట్ర సచివాలయ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుకు ఆగస్టు 28న సీఎం రేవంత్ రెడ్డి భూమిపూజ చేశారు. యూపీఏ తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభం ప్రకటన చేసిన రోజు..సోనియాగాంధీ జన్మదినం.. రాష్ట్రంలో కాంగ్రెస్? పార్టీ ప్రమాణ స్వీకారం చేసిన రోజైన డిసెంబర్ 9న తెలంగాణ తల్లి ఉత్సవాలు చేయాలని సీఎం రేవంత్? రెడ్డి గతంలోనే నిర్ణయించిన విషయం తెలిసిందే.

హైదరాబాద్, రాజన్న సిరిసిల్ల, మహబూబ్ నగర్, జనరల్

ఈ-పేపర్ తెలుగు డైలీ

ఇయ్యాల్టి NEWS

Local 2 GlobaL

https://epaper.eyyaltynews.com/

శనివారం 23 నవంబర్ 2024




## ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు..



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, నవంబర్ 22: ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. తగిన సమయంలో నిర్ణయం తీసుకునే హక్కు స్పీకర్‌కు ఉందని సూచించింది. అనర్హత పిటిషన్లపై 10వ షెడ్యూల్ ప్రకారం నిర్ణయం తీసుకోవాలని శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును హైకోర్టు డివిజన్ బెంచ్ కొట్టివేసింది. స్పీకర్‌కు టైమ్ బాండ్ లేదని ధర్మాసనం పేర్కొంది. పదో షెడ్యూల్ ప్రకారమే నిర్ణయం తీసుకోవాలని కోర్టు ఆదేశించింది. తగిన సమయంలో నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌కు సూచించింది. కాగా, పార్టీ ఫిరాయించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసిన కేసులపై సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ అసెంబ్లీ కార్యదర్శి వి.నరసింహాచార్య దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టు శుక్రవారం విచారణ జరిపి తీర్పు వెలువరించింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్ రావులపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ నేతలు పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే.

## ఏపీలో నెక్స్ట్ సీఎం ఎవరో చెప్పేసిన చంద్రబాబు.... అసెంబ్లీలో సంచలన వ్యాఖ్యలు



ఇయ్యాల్టి న్యూస్, ఏపీ, నవంబర్ 22: ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ అసెంబ్లీ సమావేశాలు శుక్రవారంతో ముగిశాయి. ఉభయ సభలను నిరవధికంగా వాయిదా వేశారు. అయితే, బడ్జెట్‌పై చర్చలో భాగంగా.. అసెంబ్లీ సమావేశాల ఆఖరి రోజు ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంచలన వ్యాఖ్యలు చేశారు.. అసెంబ్లీలో సుదీర్ఘ ప్రసంగం చేసిన చంద్రబాబు.. స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యంగా స్వర్ణాంధ్ర -2047 డాక్యుమెంట్‌ను వివరించారు. ఇందులో విజన్ 2027 కూడా ప్రకటించారు. అంటే 2027 నాటికి అమరావతి ఎలా ఉండబోతోంది. పోలవరం నిర్మాణం పరిస్థితి ఏంటనే దానిపై క్లియర్ కట్ ప్రజెంటేషన్ ఇచ్చారు సీఎం చంద్రబాబు.. అంతేకాకుండా.. డిసెంబర్ నుంచి అమరావతి పనులు పరుగులు పెట్టనున్నాయని.. మూడేళ్లలో అమరావతికి కచ్చితమైన రూపురేఖలు ఇస్తామన్నారు. 6, 9, 12, 30నెలల చొప్పున భవనాల నిర్మాణాలకు డెడ్‌లైన్స్ తోపాటు.. మూడేళ్లలో 50వేల కోట్ల ఖర్చుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. పోలవరం కూడా 2027నాటికే పూర్తి, జాతికి అంకితం చేస్తామని.. సభలో విజన్ 2047తోపాటే 2027లక్ష్యాలను సీఎం చంద్రబాబు వివరించారు..ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.. వచ్చే ఎన్నికల గురించి, సీఎం ఎవరు ఉంటారన్నదానిపై కూడా క్లారిటీ చ్చారు.. ఐదోసారి కూడా ముఖ్యమంత్రిగా వస్తానంటూ చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. అంటే.. వచ్చే సారి కూడా తానే ముఖ్యమంత్రి అంటూ చెప్పకనే చెప్పారు.. సీఎం చంద్రబాబు.. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు 4.0 వెర్షన్ ఇప్పుడే మొదలైందన్న చంద్రబాబు.. ఐదోసారి కూడా తానే ముఖ్యమంత్రిగా వస్తానంటూ ధీమా వ్యక్తంచేశారు. మంచి చేసే వారిని ప్రజలు మళ్లీ మళ్లీ గెలిపిస్తారన్న చంద్రబాబు.. కొన్ని రాష్ట్రాలలో ఒకే పార్టీ 30 ఏళ్లు పాలించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు.వెల్తీ, హెల్తీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్ నినాదంతో తమ ప్రభుత్వం పనిచేస్తోందని.. టీమ్ లీడర్‌గా తాను పనిచేస్తానని.. మిగతా సభ్యులు కూడా ఇందుకోసం కృషి చేయాలంటూ సీఎం చంద్రబాబు సూచించారు. ఎమ్మెల్యేలంతా.. తమ తమ నియోజకవర్గ పరిధిలోనూ విజన్ డాక్యుమెంట్ తయారు చేయాలని సూచించారు.

## అంబర్ పేటలో కల్యాణ లక్ష్మి చెక్కుల అందజేత



ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, నవంబర్ 22: అంబర్ పేట నియోజకవర్గంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. శుక్రవారం హిమాయత్ నగర్ మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మొత్తం 31 మంది లబ్ధిదారులకు 1,00116/- రూపాయల చొప్పున దాదాపు రూ 31.00 లక్షల విలువగల చెక్కులను స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో లోకల్ కార్పొరేటర్ కన్నా ఉమా రమేష్ యాదవ్, ఎమ్మార్వో డి.సంధ్యా రాణి తదితరులు ఉన్నారు.

## మోదీ వల్లే అదానీ దురాగతాలు పెరిగిపోతున్నాయి:టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, నవంబర్ 22: మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ధనికుడు.. పేదలు మధ్య వ్యత్యాసం పెరిగిపోతుందని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మోడీ వల్లనే అదానీ దురాగతాలకు పాల్పడుతున్నారని ఆయన మండిపడ్డారు. అమెరికా అదానీ కుంభకోణం బయట పడిందని, మన రాష్ట్రంలో కొంతమంది పెద్దలకు ముడుపులు అందాయన్నారు మహేష్ కుమార్ గౌడ్. అర్హత లేకుండా అదానీ కంపనీ రుణాలు పొందిందని, అదానీ అరెస్టు ఐతే ప్రధాని మోడీ రాజీనామా చేయాల్సి వస్తుందన్నారు మహేష్ కుమార్ గౌడ్. మోడీ వచ్చాకా.. అదానీ ఆస్తులు ఎలా పెరిగాయి..? అని ఆయన ప్రశ్నించారు. కేంద్రం బాసటగా ఉండటం వల్లనే ఆస్తులు పెరిగాయని, అదానీ వ్యవహారం పై జేపీసీ వేయాలని మహేష్ గౌడ్ అన్నారు. కేటీఆర్ కూడా స్కిల్ యూనివర్సిటీకి వంద కోట్లు ఇస్తా అంటే తీసుకుంటామని, అదానీ వంద కోట్లు స్కిల్ యూనివర్సిటీ కి ఇచ్చారన్నారు.

## తిరుమల లడ్డు కల్తీ నెయ్యి వ్యవహారంపై విచారణ ప్రారంభించిన సిట్..





ఇయ్యాల్టి న్యూస్, ఏపీ, నవంబర్ 22: తిరుమల లడ్డు కల్తీ నెయ్యి వ్యవహారంపై విచారణను సిట్ ప్రారంభించింది. శుక్రవారం ఉదయం తిరుపతికి సిట్ బృందం చేరుకుంది. నలుగురు డీఎస్పీ, సీఐ, ఎస్సైలతో కలిసి సిట్ బృందం తిరుపతి, తిరుమలలో పర్యటించనుంది. ఈ క్రమంలో.. తిరుపతి భూదేవి కాంప్లెక్స్‌లో తాత్కాలిక ఆఫీస్ ఏర్పాటు చేశారు. కల్తీ నెయ్యి కేసుపై పూర్తి స్థాయి విచారణ చేపట్టి సీబీఐ డైరెక్టర్‌కు నివేదికను ఇవ్వనుంది ఈ బృందం. డీస్పీలు సీతా రామాంజనేయులు, శివ నారాయణ స్వామి, కృష్ణమోహన్, వెంకట్రామయ్యల పోలీసు అధికారుల బృందం తిరుపతి, తిరుమల, ఏఆర్ డైరీలలో విచారణ చేయనున్నారు. నాలుగు బృందాలుగా ఏర్పడి కల్తీ నెయ్యి వ్యవహారం పై విచారణ చేపట్టనుంది సిట్. గత టీటీడీ బోర్డ్ దగ్గర నుంచి అధికారులు, సిబ్బంది పాత్ర వరకు అన్ని అంశాలపై లోతుగా దర్యాప్తు చేయనుంది. నెయ్యిని సరఫరా చేసిన ఏఆర్? డైయిరీ ఫుడ్స్ ప్రైవేట్? లిమిటెడ్? సంస్థను తమిళనాడులోని దుండిగల్? వెళ్లి ఓ బృందం దర్యాప్తు చేయనుంది. మరో బృందం తిరుమల వెళ్లి లడ్డూ పోటు, లడ్డూ విక్రయ కేంద్రాలు, లడ్డూ తయారీకి వినియోగించే ముడి సరుకులను పరిశీలించడంతో పాటు లడ్డూ తయారీలో పాల్గొంటున్న శ్రీ వైష్ణవులను సిట్ ప్రశ్నించనుంది. మరో బృందం తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలో నెయ్యి కొనుగోలు, ఒప్పందాలు, నాణ్యమైన నెయ్యి సరఫరా కోసం టీటీడీ, ఏఆర్? డైయిరీ మధ్య జరిగిన ఒప్పందాలను పరిశీలించనుంది.

## కేంద్ర ప్రభుత్వ పథకాల నిధులను సమర్ధవంతంగా వినియోగించుకోవాలి: మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



ఇయ్యాల్టి న్యూస్, నల్లగొండ, నవంబర్ 22: కేంద్ర ప్రభుత్వ పథకాల నిధులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సూచించారు. నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన దిశ (కేంద్ర విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ) సమావేశానికి స్థానిక ఎంపీ రఘువీర్ రెడ్డి అధ్యక్షత వహించగా, జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ పథకాలను రాష్ట్రంలో అమలు చేయడం ద్వారా పేదరిక నిర్మూలన, ఉపాధి అవకాశాల పెంపు, గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి లక్ష్యాలను సాధించవచ్చని తెలిపారు. కేంద్ర పథకాల అమలుకు సంబంధించి తన ఎంపీ అనుభవాలను సభ్యులతో పంచుకుంటూ, వాటిని ఎఫెక్టివ్‌గా అమలు చేయడంపై దృష్టి సారించాలని సూచించారు.కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ప్రతీ జిల్లాలో దిశ కమిటీలను ఏర్పాటు చేసి, అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణకు అవసరమైన సమన్వయం అందిస్తోందని మంత్రి తెలిపారు. తుమ్మల నాగేశ్వర్ రావుతో కలిసి నల్లగొండ జిల్లాలో అమలవుతున్న పథకాలపై సమీక్ష నిర్వహించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు నేనావత్ బాలు నాయక్, వేముల వీరేశం, మందుల సామేల్, బత్తుల లక్ష్మారెడ్డి, కుందూరు జయవీర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రీ లాంచింగ్ పేరిట భారీ మోసం..
## 600 మంది నుండి రూ.150 కోట్లు వసూలు..




ఇయ్యాల్టి న్యూస్, క్రైం, నవంబర్ 22: ప్రీ లాంచింగ్ పేరిట భారీ మోసం హైదరాబాద్ లో వెలుగు చూసింది. ఆర్జే వెంచర్స్ యాజమాన్యం సుమారు 600 మంది నుండి 150 కోట్లు వసూలు చేసినట్లు సంచలన విషయాలు బయటకు రావడంతో పోలీసులు షాక్ అయ్యారు. బాధితులు అందరూ బషీర్ బాగ్ పోలీస్టేషన్ క్యూ కట్టారు. పోలీస్టేషన్ ముందు ఆర్జే బాధితులు అంటూ బ్యానెర్ తో ఆందోళనకు దిగారు. దీంతో బషీర్ బాగ్ పోలీస్టేషన్ వద్ద గందరగోళ పరిస్థితి నెలకొంది. నారాయణఖేడ్, ఘట్కేసర్ , పటాన్ చెరువు, కర్తను ప్రాంతాలలో అపార్ట్మెంట్ , ఫార్మ్ ల్యాండ్ పేరిట ప్రముఖులతో ఆర్జే వెంచర్స్ ప్రకటనలు చేశారు. దీంతో 2020 లో తాము నమ్మి ఒక్కొక్కరం 20 లక్షల నుండి 50 లక్షల వరకు కట్టామని బాధితులు లబోదిబో మన్నారు. నాలుగేళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టలేదని వాపోయారు. వెంచర్ ఎండి భాస్కర్ గుప్త, డైరెక్టర్ సుధారాణి మాటలు నమ్మి సుమారు 600 మంది సుమారు రూ.150 కోట్లు కట్టామని వాపోయారు. తాము ఎన్నిసార్లు అడిగిన నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తుండటంతో అనుమానం వచ్చిన బాధితులు ఎండీని నిలదీశామన్నారు. దీంతో ఎండీ భాస్కర్ చెక్కులు ఇచ్చారని తెలిపారు. కానీ అవి కూడా బౌన్స్ అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. వెంచర్ కార్యాలయం సైబరాబాద్ పరిధిలో ఉందని తెలిపారన్నారు.. అక్కడికి వెళ్లి ఫిర్యాదు చేస్తామన్నారు. ఆర్జే వెంచర్స్ ఆస్తులు అమ్మి తమకు న్యాయం చేయాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. ఆర్జే వెంచర్స్ 600 మందికి మోసం చేసిందని వాపోయారు. లక్షల్లో మోసపోయామని వెంటనే తమ డబ్బును ఆర్జే వెంచర్స్ ద్వారా ఇప్పించాలని బాధితులు వేడుకుంటున్నారు. అప్పులు చేసి ఆర్జే వెంచర్స్ పై డబ్బులు కట్టామని, వెంటనే అధికారులు స్పందించాలని కోరారు. ఆర్జే వెంచర్స్ యాజమాన్యం పారిపోకుండా వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## రేవంత్ రెడ్డి తలకాయ లేని ముఖ్యమంత్రి.. హరీశ్‌రావు కామెంట్స్



ఇయ్యాల్టి న్యూస్, ఖమ్మం, నవంబర్ 22: హైదరాబాద్‌కు మూడు దిక్కుల సముద్రం ఉందని చెప్పిన తలకాయ లేని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. నోటికి ఏది వస్తే అది మాట్లాడడం.. అబద్దాలు చెప్పడం ముఖ్యమంత్రికి అలవాటు అయిపోయిందని మండిపడ్డారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం ప్రొద్దుటూరు గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో హరీశ్‌రావు పాల్గొని ప్రసంగించారు. గ్యారెంటీలు అమలు చేయనందుకు ముక్కు నేలకు రాసి తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలి. కరోనా కష్టకాలంలో కూడా మంత్రుల ఎమ్మెల్యేల జీతాలు బందు పెట్టి రైతులకు రైతుబంధు ఇచ్చింది కేసీఆర్ ప్రభుత్వం. రూ. 15000 రైతుబంధు ఇస్తామని చెప్పి ఉన్న రూ. 10000 కూడా ఎగ్గొట్టిండు రేవంత్ రెడ్డి. ఇది ఏంటి అని ప్రశ్నిస్తే కేసులు పెట్టడం. ప్రతిపక్షాల గొంతు నొక్కడం వంటివి చేస్తున్నాడు. ఇగురం లేనోడు వ్యవసాయం చేస్తే వడ్లు వాగులో గడ్డి గాళ్ళలో కొట్టుకుపోయింది అంట. ఈ రేవంత్ రెడ్డి పాలన ఇట్లనే ఉన్నది. అందుకే నువ్వు ఎనుముల రేవంత్ రెడ్డి కాదు ఎగవేతల రేవంత్ రెడ్డి అని హరీశ్‌రావు విమర్శించారు.

నేషనల్, ఇంటర్నేషనల్ , క్రైం, వైరల్ న్యూస్

ఇయ్యాల్టి NEWS Local 2 GlobaL

https://epaper.eyyaltynews.com/

శనివారం 23 నవంబర్ 2024



# దూసుకుపోయిన మార్కెట్లు.. 1,961 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

ఇయ్యాల్టి న్యూస్, బిజినెస్, నవంబర్ 22: దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం దూసుకుపోయాయి. కొనుగోళ్ల మద్దతుతో సూచీలు కళకళలాడాయి. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ బలపడింది. దీంతో మదుపరులు కొనుగోళ్లకు మొగ్గు చూపారు. శుక్రవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ ఏకంగా 1,961 పాయింట్లు ఎగబాకి 79,117కి చేరుకుంది. నిఫ్టీ 557 పాయింట్లు పెరిగి 23,907 వద్ద స్థిరపడింది. బీఎస్ఈ సెన్సెక్స్ లో అన్ని కంపెనీలు లాభాలను మూటకట్టుకున్నాయి. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (4.51%), టీసీఎస్ (4.13%), టైటాన్ (4.10%), ఐటీసీ (3.92%), ఇన్ఫోసిస్ (3.75%) టాప్ గెయినర్లుగా నిలిచాయి.మరోవైపు గత గురువారం భారీగా పతనమైన అదానీ గ్రూప్ షేర్లు శుక్రవారం కోలుకున్నాయి. అదానీ పోర్ట్స్ 2 శాతానికి పైగా లాభపడింది.



# చితిపై తగలబడుతుండగా ఒక్కసారిగా లేచిన యువకుడు




ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, నవంబర్ 22: రాజస్థాన్‌లో ఘోర అమానుష ఘటన చోటుచేసుకుంది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ఓ నిండు ప్రాణం బలైపోయేది. పోలీసుల అప్రమత్తతతో యువకుడి ప్రాణాలు నిలబడ్డాయి. ఈ ఘటన జుంజును జిల్లాలో చోటుచేసుకుంది. రాజస్థాన్‌లోని జుంజును జిల్లాలో 25 ఏళ్ల చెవిటి, మూగ యువకుడు రోహితాష్ కుమార్ అనాథగా ఉంటున్నాడు. కుటుంబం లేకపోవడంతో ఒక షెల్టర్ హోమ్‌లో నివాసం ఉంటున్నాడు. అతడి ఆరోగ్యం బాగోలేకపోతే స్థానిక జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ అతడి పరిస్థితి విషమించడంతో ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో చేర్చి చికిత్స అందించారు. అయితే గురువారం మధ్యాహ్నం 2 గంటలకు రోహితాష్ కుమార్ చనిపోయినట్లుగా వైద్యులు నిర్ధారించారు. అనంతరం మృతదేహాన్ని ఖననం చేసేందుకు పోలీసులు స్మశానానికి తీసుకెళ్లారు. చితిపై మృతదేహాన్ని పెట్టి తగలబెడుతుండగా హఠాత్తుగా కుమార్ శ్వాస తీసుకోవడం ప్రారంభించాడు. మంటల్లోంచి కుమార్ లేచి కూర్చున్నాడు. వెంటనే పోలీసులు స్పందించి కుమార్‌ను అంబులెన్స్‌లో తీసుకెళ్లి ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం యువకుడి ఆరోగ్యం నిలకడగా ఉందని పోలీసులు తెలిపారు. రెవెన్యూ అధికారి మహేంద్ర ముండ్, సామాజిక న్యాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పవన్ పూనియా కూడా ఆస్పత్రికి చేరుకుని వివరాలు సేకరించారు. అయితే ఈ ఘటనపై జుంజును జిల్లా కలెక్టర్ రమనతార్ మీనా ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యుల తీరును తీవ్రంగా ఖండించారు. చనిపోయినట్లు నిర్ధారించిన డాక్టర్ యోగేష్ జాఖర్, డాక్టర్ నవనీత్ మీల్, డాక్టర్ సందీప్ పచార్‌లను గురువారం రాత్రి సస్పెండ్ చేశారు. అలాగే ఈ ఘటనపై విచారణకు ఆదేశించారు. ఒక కమిటీని కూడా ఏర్పాటు చేశారు. మరోవైపు ఈ ఘటనపై వైద్య శాఖ కార్యదర్శికి సమాచారం అందించినట్లు కలెక్టర్ మీనా తెలిపారు.

# గర్ల్ ఫ్రెండ్ కోసం రెండు దేశాలల్లో చక్కర్లు

## ఆ యువకుడు చెప్పిన రీజన్ వింటే షాక్..

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, నవంబర్ 22: ప్రేమించిన అమ్మాయి కోసం తపించిపోయే ప్రేమికుల్ని చూసాం. కానీ చైనాలో ఓ యువకుడు గర్ల్‌ఫ్రెండ్‌తో టైమ్ గడిపేందుకు వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న కాలేజీకి వారం వారం విమాన ప్రయాణం చేశాడు. ప్రతి వారం విమానంలో వెళ్లి క్లాస్‌కు హాజరై, తిరిగి విమానంలో రావడం ఎంతో సవాలుతో కూడుకున్న పని. ఎన్ని కష్టాలు ఎదురైనా సరే.. గర్ల్‌ఫ్రెండ్ కోసం విమాన ప్రయాణం చేస్తూ వార్తల్లో నిలిచాడు.జు గువాంగ్లీ చైనాలో నివాసం ఉంటాడు. ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో ఆర్ఎంఐటీ విశ్వవిద్యాలయంలో ఎనిమిదేళ్లు చదువుకున్నాడు. ఆఖరు సెమిస్టర్ ఒక్కటే మిగిలుంది. కేవలం ఒకే ఒక క్లాస్ మూడు నెలల పాటు అటెండ్ అయితే చాలు. మాస్టర్స్ డిగ్రీ వచ్చేస్తుంది. అందుకోసం చైనా నుంచి మెల్‌బోర్న్‌కు ప్రతి వారం విమాన ప్రయాణం చేసాడు. గతేడాది ఆగస్ట్ నుంచి అక్టోబర్ మధ్య మూడు నెలల సమయంలో వారానికి ఒకసారి చొప్పున 11 సార్లు ఫ్లైట్ జర్నీ చేశాడు గువాంగ్లీ. చైనా నుంచి మెల్‌బోర్న్‌కు గువాంగ్లీకి ప్రయాణానికి మూడ్రోజులు పట్టేది. అయినా ప్రయాణం చేయడానికే ఆసక్తి చూపేవాడు. చైనాలో విమానం ఎక్కితే మరునాడు ఆస్ట్రేలియా చేరుకునేవాడు. ఆ రోజు క్లాస్‌కి వెళ్లి మరుసటి రోజు ఫ్లైట్ ఎక్కి చైనా తిరిగొచ్చేవాడు.



ప్రతీ వారం విమానంలో ఎందుకు వెళ్తాడు అని ఎవరైనా అతనిని అడిగినప్పుడు.. అతను చెప్పిన సమాధానం విని ఆశ్చర్యపోయారు.ఎందుకంటే తాను రెండు దేశాల మధ్య చక్కర్లు కొట్టడానికి కారణం తన గర్ల్ ఫ్రెండ్ అని చెప్పాడు. మెల్‌బోర్న్ విశ్వవిద్యాలయంలో ఉండగా పరిచయమైందని అనుకోకుండా తన గర్ల్‌ఫ్రెండ్ తనకంటే ముందు చైనాకు తిరిగొచ్చేసిందని అన్నాడు. ఆమె కోర్స్ పూర్తి కావడంతో ఆమె తిరిగి చైనా వచ్చేసిందని ఆమె లేకుండా మెల్‌బోర్న్‌లో ఏదో వెలితిగా అనిపించేదనీ ఒంటరితనం వెంటాడేదని గువాంగ్లీ తెలిపాడు. సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన వీడియోలో తన ప్రయాణ అనుభవాన్ని షేర్ చేసుకున్నాడు. విమాన టికెట్ కోసం, ట్యాక్సీ ఛార్జీలు భోజనం కోసం తనకు ఎంత ఖర్చు అయిందీ వివరించాడు. అలా మెల్‌బోర్న్ వెళ్లిన ప్రతీసారి డబ్బు ఆదా చేయడానికి ఫ్రెండ్ ఇంట్లో వారంలో ఒక రాత్రి బస చేసేవాడట.

# మెంటలక్క...తండ్రి శవాన్ని కాల్చిన బూడిదపై గంజాయి మొక్క పెంచి.. సిగరెట్లుగా కాల్చి నివాళి..

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, నవంబర్ 22: పుర్రెకో బుద్ధి, జిహ్వకో రుచి అంటారు.. ప్రస్తుత కాలంలో సోషల్ మీడియా లైకులు, ఫేమ్ కోసం చాలా మంది అలాంటి చిత్ర విచిత్రమైన పనులే చేస్తున్నారు. రాత్రి రాత్రే గొప్ప స్టార్ అయిపోవాలనే ఆరాటంతో కొందరు విపరీతాలకు పాల్పడుతున్నారు. కొందరు ప్రాణాలను రిస్క్‌లో పెడుతూ భయంకరమైన స్టంట్స్ చేస్తుంటే, మరికొందరు ఎదుటి వారి ప్రాణాలను ప్రమాదంలోకి నెడుతుంటారు.. ఇంకొందరు అవతలి వారి మనోభావాలను దెబ్బతీసేలా ఉంటారు.. ఇంకొందరు మనుషుల భావోద్వేగాలను కూడా వదలకుండా రీల్స్ పిచ్చితో రెచ్చిపోతుంటారు.. అలాంటి ఓ విపరీత ధోరణి కలిగి ఓ యూట్యూబర్ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియా వేదికగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పూర్తి వివరాల్లోకి వెళితే..మహిళలు గంజాయి కాల్చడం కొత్తేమీ కాదు. వింత మరీ కాదు. కానీ, తన తండ్రి మరణిస్తే శవాన్ని కాల్చగా మిగిలిన బూడిదపై గంజాయి మొక్కను పెంచి, ఆ గంజాయి ఆకులతో సిగరెట్టు చేసుకుని తాగానని చెప్పడమే ఇక్కడ అందరినీ విస్తుపోయేలా చేసింది. అవును ఇదంతా, అమెరికాకు చెందిన ఓ యూట్యూబర్ రోసన్నా పాన్సినో తన మాటల్లోనే చెప్పిన వాస్తవాలు.. ఆమె తన రాడిక్యులస్ పోడ్‌కాస్ట్ తొలి ఎపిసోడ్ సందర్భంగా దివంగత తండ్రికి ప్రత్యేక నివాళులర్పించింది .

39 ఏళ్ల ఇంటర్నెట్ స్టార్, 14.6 మిలియన్లకు పైగా యూట్యూబ్ సబ్‌స్క్రైబర్‌లతో దూసుకుపోతున్న యూట్యూబర్ రోసన్నా పాన్సినో తన తండ్రి చితభస్మం ఉపయోగించి పెరిగిన గంజాయితో చేసిన సిగరెట్‌ను కాల్చి తన తండ్రికి నివాళి అర్పించానని చెప్పారు. పోడ్‌కాస్ట్ ఎపిసోడ్, “స్మోకింగ్ మై డెడ్ డాడ్” పేరుతో నవంబర్ 17న ఈ వీడియో ప్రసారమైంది. లుకేమియాతో ఆరేళ్ల పోరాటం తర్వాత ఐదేళ్ల క్రితం తన తండ్రి చనిపోయాడని చెప్పింది. చనిపోయే ముందు తన తండ్రి అసాధారణమైన కోరిక ఇదేనని పాన్సినో పేర్కొంది. అతను తన బూడిదను గంజాయి మొక్కకు ఉపయోగించి పెంచమని కోరినట్టుగా చెప్పింది. తన తండ్రి కోరిక మేరకు తను ఇలా చేశానని రోసన్నా వెల్లడించింది. కాగా, ఇందుకు సంబంధించిన వీడియో మాత్రం నెట్టింట తీవ్ర దుమారం రేపింది.




# అదానీ లంచం కేసుపై వైట్‌హౌస్ రియాక్షన్..




ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, నవంబర్ 22:గౌతమ్ అదానీపై అమెరికాలో కేసు నమోదు కావడం సంచలనంగా మారిపోయింది. సౌర విద్యుదుత్పత్తి సరఫరా ఒప్పందాలు చేసుకునేందుకు భారత్‌లో రూ.2,029 కోట్ల లంచాలు ఇచ్చారని.. ఆ సొమ్ము కోసం తప్పుడు సమాచారం ఇచ్చి యూఎస్ లో నిధులు సేకరించారని అదానీ సహా మరో 7 మందిపై కేసు నమోదైంది. దీనిపై తాజాగా అమెరికా అధ్యక్ష భవనం రియాక్ట్ అయింది. ఈ సంక్షోభాన్ని ఇరు దేశాలు అధిగమిస్తాయని విశ్వాసం వ్యక్తం చేసింది.కాగా, వైట్ హౌస్ మీడియా కార్యదర్శి కరీన్ జీన్ పియర్ ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ.. అదానీ లంచం కేసు మా దృష్టికి వచ్చిందన్నారు. ఈ ఆరోపణలపై సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్, న్యాయశాఖనే సరైన సమాచారం ఇస్తుందన్నారు. ఇక, భారత్-అమెరికా దేశాల మధ్య సంబంధాలు బలంగానే ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. తాము అనేక అంశాలపై పరస్పర సహకారం అందించుకున్నాం.. మిగతా సమస్యల మాదిరిగానే ఈ సంక్షోభాన్ని ఇరు దేశాలు పరిష్కరిస్తాయని కరీన్ విశ్వాసం వ్యక్తం చేశారు.అయితే, అమెరికాలో నిధులు సేకరించేందుకు తప్పుడు సమాచారం ఇచ్చారని అదానీతో పాటు మరో 7 మందిపై కేసు ఫైల్ అయింది. కాగా, ఫారిన్ కరప్ట్ ప్రాక్టీసెస్ చట్టం కింద వీరందరికి హెల్ప్ చేసిన మరో ఐదుగురిపైనా కేసు నమోదైంది. ఈ కేసులో గౌతమ్ అదానీతో పాటు సాగర్ అదానీపైనా న్యూయార్క్ అరెస్ట్ వారంట్లు జారీ చేసినట్లు పలు మీడియా సంస్థలు తెలిపాయి. 20 ఏళ్లలో 2 బిలియన్ డాలర్ల లాభాన్ని పొందేలా అధిక ధరకు సౌర విద్యుత్‌ను కొనుగోలు చేసేలా వీరంతా ఏపీ, ఒడిశా రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన అధికారులకు లంచాలు ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి.

# ముగిసిన మోదీ విదేశీ పర్యటన



ఇయ్యాల్టి న్యూస్, ఢిల్లీ, నవంబర్ 22: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విదేశీ పర్యటన ముగిసింది. నవంబర్ 16 నుంచి 21 వరకూ రెండు ఖండాల్లోని మూడు దేశాల్లో మోదీ పర్యటించిన విషయం తెలిసిందే. తాజాగా ఐదు రోజుల విదేశీ పర్యటను ముగించుకొని మోదీ స్వదేశానికి చేరుకున్నారు. మోదీ ముందుగా నైజీరియా అధ్యక్షుడు బోలా అహ్మద్ టినుబు ఆహ్వానం మేరకు ఈనెల 16 %-% 17 తేదీల్లో నైజీరియాలో పర్యటించారు. 17 ఏళ్లలో భారత ప్రధాని నైజీరియాలో పర్యటించడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ సందర్భంగా ప్రధాని మోదీ రెండు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని సమీక్షించడంతోపాటు ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించారు. పర్యటనలో భాగంగా నైజీరియాలోని భారతీయుల్ని ఉద్దేశించి మోదీ ప్రసంగించారు.నైజీరియా పర్యటనను ముగించుకొని ప్రధాని బ్రెజిల్ పర్యటనకు వెళ్లారు. నవంబర్ 18, 19 తేదీల్లో బ్రెజిల్ అధ్యక్షుడు లూయిస్ ఇనాసియో లులా డా సిల్వా ఆధ్వర్యంలో రియోడిజనీరో నగరంలో జరిగిన జీ-20 సదస్సులో పాల్గొన్నారు. ఈ సమ్మిట్‌లో పలువురు ప్రపంచ నేతలతో ప్రధాని ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించారు.ఆ తర్వాత మోదీ గయానాకు వెళ్లారు. 56 ఏళ్ల తర్వాత (1968 తర్వాత) భారత ప్రధాని ఒకరు గయానాలో పర్యటించడం ఇదే తొలిసారి. ఈ పర్యటనలో గయానా అధ్యక్షుడు మొహమ్మద్ అలీతో మోదీ చర్చలు జరిపారు. ఇతర సీనియర్ నాయకులతోనూ సమావేశం అయ్యారు. ఇక ఈ పర్యటనలో మోదీకి అరుదైన గౌరవం లభించింది. గయానా, డొమెనికా దేశాలు తమ అత్యున్నత పురస్కారాలతో ప్రధానిని సత్కరించాయి.

# 10 మంది నక్సల్స్ హతం.. డ్యాన్స్ చేసిన డీఆర్‌జీ జవాన్లు.. వీడియో



ఇయ్యాల్టి న్యూస్, చత్తీస్ ఘడ్, నవంబర్ 22: చత్తీస్‌ఘడ్ లోని సుక్మాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో శుక్రవారం పది మంది నక్సల్స్ హతం అయ్యారు. బెజ్జి పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న అటవీ ప్రాంతంలో ఎదురుకాల్పులు జరిగినట్లు బస్తర్ రేంజ్ ఐజీ పీ సుందర్‌రాజ్ తెలిపారు. అయితే నక్సలైట్లను మట్టుపెట్టిన తర్వాత డిస్ట్రిక్ రిజర్వ్ గార్డులు సంబరాలు చేసుకున్నారు. నక్సల్స్‌ను హతమార్చిన ఆనందంలో చిందేశారు. గన్నులు పట్టుకుని .. గుంపులుగా డ్యాన్స్ చేశారు. గిరిజన తెగల స్టయిల్‌లో నృత్యం చేశారు. కొరాజ్‌గూడ, దంతేస్పురం, నాగారం, బందార్పదార్ గ్రామాల్లోని అటవీ ప్రాంతాల్లో కొంటా, కిస్టారం ఏరియా కమిటీ నక్సల్స్ సంచరిస్తున్నట్లు సమాచారం రావడంతో.. ఇవాళ ఉదయం ప్రత్యేక దళాలు ఆపరేషన్ చేపట్టాయి. ఆ ప్రాంతం నుంచి 10 మంది నక్సలైట్ల మృతదేహాలను రికవరీ చేసినట్లు ఐసీ సుందర్‌రాజ్ తెలిపారు. నక్సల్స్ నుంచి ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ఇన్సాస్ రైఫిళ్లు, ఏకే-47, ఎస్ఎల్ఆర్ గన్లను కూడా సీజ్ చేశారు

ఇయ్యాల్టి NEWS
Local 2 GlobaL
https://epaper.eyyaltynews.com/
శనివారం 23 నవంబర్ 2024




## చూసి ముర్వాలే




## ‘ఆ దేవుడే వస్తాడు’.. భయంకరంగా ‘హరికథ’ ట్రైలర్..

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, నవంబర్ 22: ఈ మధ్య కాలంలో చాలా వరకు సినీ ఆడియన్స్ అందరూ ఓటీటీలోనే సినిమాలు, సిరీస్ చూడడానికి ఇంట్రెస్ట్ చూపిస్తున్నారు. ఓటీటీల్లో సిరీస్ కూడా ఈ మధ్య కాలంలో ఎక్కువగానే వస్తున్నాయి. చాలా వరకు చిన్న సినిమాలను కూడా ఓటీటీల్లోనే రిలీజ్ చేస్తున్నారు. ఇలా నేరుగా ఓటీటీల్లో వస్తున్న సినిమాలు కూడా మంచి రెస్పాన్స్ అందుకుంటున్నాయి.అయితే ఇప్పుడు తాజాగా డిస్నీ ప్లస్ హాట్ స్టార్ లో తెరకెక్కుతున్న ఓ ఇంట్రెస్టింగ్ సిరీస్ హరికథ సంభవామి యుగే యుగే. పీరియడ్రికల్ బ్యాగ్ డ్రాప్ లో మిస్టరీ థ్రిల్లర్ గా ఈ సిరీస్ రాబోతుంది. తాజాగా ఈ సిరీస్ కి సంబందించిన ట్రైలర్ రిలీజ్ చేసారు మేకర్స్. ఇక ఇందులో శ్రీరామ్, విజయేంద్ర ప్రసాద్, బిగ్ బాస్ దివి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కాగా ఈ సిరీస్ డిసెంబర్ 13 నుండి డిస్నీ ప్లస్ హాట్ స్టార్ లో స్ట్రీమింగ్ కానున్నట్టు తెలుపుతూ సరికొత్త పోస్టర్ రిలీజ్ చేసారు. ఇక ఈ సిరీస్ ను ప్రముఖ టాలీవుడ్ నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తుంది. ఇక ట్రైలర్ మాత్రం చాలా భయంకరంగా ఉంది. అధర్మం హద్దు మీరినప్పుడు.. అన్యాయాన్ని ఎదురించాల్సిన వారు చేతులు కట్టుకొని కూర్చున్నప్పుడు.. ఆ ధర్మాన్ని కాపాడడానికి దేవుడే వస్తాడు అనే డైలాగ్ తో ట్రైలర్ చాలా ఇంట్రెస్టింగ్ గా చూపించారు. ఒక ఉర్లో వరుస హత్యలు జరుగుతున్న నేపథ్యంలో.. ఆ హత్యలను దేవుడే చేస్తున్నాడని అందరూ నమ్ముతారు.. అసలు ఆ హత్యలు ఎందుకు, ఎవరు చేసారో సిరీస్ లో చూడండి.




## మహదేవ్ శాస్త్రిగా మోహన్ బాబు.. ‘కన్నప్ప’ నుంచి ఫస్ట్ లుక్ రిలీజ్

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, నవంబర్ 22: మంచు ఫ్యామిలీ నుంచి వస్తున్న మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ కన్నప్ప . దాదాపు రూ.100 కోట్ల బడ్జెట్‌తో వస్తున్న ఈ సినిమాను కలెక్షన్ కింగ్ మంచు మోహన్ బాబు నిర్మిస్తుండగా.. మంచు విష్ణు కథానాయకుడిగా నటిస్తున్నాడు. హిస్టారికల్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ చిత్రంలో ప్రభాస్‌తో పాటు బాలీవుడ్, కోలీవుడ్ అగ్ర తారలు నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి మహాభారతం సీరియల్ ఫేమ్ ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే ఈ మూవీ నుంచి విష్ణుతో పాటు ప్రముఖుల ఫస్ట్ లుక్‌లను పంచుకున్న చిత్రబృందం తాజాగా మోహన్ బాబు ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది. ఈ సినిమాలో మోహన్ బాబు మహదేవ్ శాస్త్రి అనే పవర్‌ఫుల్ రోల్‌లో కనిపించబోతున్నట్లు చిత్రబృందం తెలిపింది

## జావేద్ అందాల ఆరబోతకు నో లిమిట్స్.. మైండ్ బ్లోయింగ్ పిక్స్ వైరల్..

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, నవంబర్ 22: సోషల్ మీడియాలో స్పీడ్ మీద ఉండే బాలీవుడ్ భామ యుర్ఫీజావేద్ గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. ప్రేక్షకులను తన అందాలతో మెస్మరైజ్ చేసే ఈ బ్యూటీ హాట్ ఫోటోలు ఇన్స్టాగ్రామ్ లో తెగ వైరలవుతున్నాయి.





## స్పెషల్ ట్రీట్ .. తళుక్కుమంటున్న పాలక్ తివారీ .

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, నవంబర్ 22: బాలీవుడ్ బ్యూటీ పాలక్ తివారీ సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తోంది. తాజాగా ఆమె తన హాట్ ఫోటోలను అభిమానులతో పంచుకుంది. బాలీవుడ్ దీపావళి పార్టీలో ఇలా తళుక్కుమని మెరిపించింది.



## హాట్ ఫొటోలతో పూనమ్ బజ్వా... గోవాలో వెకేషన్ ఎంజాయ్ చేస్తూ.

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, నవంబర్ 22: నటి పూనమ్ బజ్వా తాజాగా గోవా వెకేషన్ కు వెళ్లడంతో అక్కడ ఎంజాయ్ చేస్తూ హాట్ హాట్ ఫోటోలు సోషల్ మీడియాలో షేర్ చేస్తుంది.



## మోడ్రన్ డ్రెస్‌లో.. రచ్చ లేపుతున్న రాశీ సింగ్..

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, నవంబర్ 22: హీరోయిన్ రాశీ సింగ్ తాజాగా ఇలా చీరలో హాట్ గా మెరిపిస్తూనే మరో పక్క మోడ్రన్ డ్రెస్ లో అదరగొడుతూ హాట్ హాట్ ఫోటోలు పోస్ట్ చేసింది.

PUBLISHED AND PRINTED BUY K.RAKESH. ON BEHALF OF RRR MEDIA ..Editor : **RR RATHNA**, Address.Patel Nagar Chowrastha, Amberpet, Hyderabad,Telangana - 500013.
**RNI NO. T/TG/2024/ 1093** ..Mobile No : 7013794396, 9949152838 ,Website : www.eyyaltynews.comEMAIL ..ramannews9@gmail.com.